సాక్షి ఏలూరు

మంగళవారం । 9 ఏప్రిల్ । 2024




ఉగాది వేడుకలకు ముస్తాబు

ద్వారకాతిరుమల: ఉగాది వేడుకలకు చిన వెంకన్న క్షేత్రం ముస్తాబైంది. మంగళవారం క్షేత్రంలో ప్రత్యేక పూజలు, పంచాగ శ్రవణం, పండిత సత్కారాలు జరుగనున్నాయి.



భారీగా నగదు పట్టివేత

సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు జరుగుతున్నాయి. పలు ప్రాంతాల్లో భారీగా నగదు పట్టుబడింది. 2లో ▸



	ఇఫ్తార్ మంగళవారం (సాయంత్రం)	సహరి బుధవారం (ఉదయం)
ఏలూరు	6.27	4.29
భీమవరం	6.25	4.32

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీకే బీసీల మద్దతు



మాట్లాడుతున్న బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్‌యాదవ్

ఏలూరు (టూటౌన్): సామాజిక న్యాయం సాధనకు ముందుకు వచ్చిన వైఎస్సార్‌సీపీకే బీసీలు తమ పూర్తి మద్దతు తెలియజేయాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు సాదం భాస్కర్‌యాదవ్ పిలుపు నిచ్చారు. స్థానిక అమీనాపేట ఏటిగట్టులోని యాదవ సంఘం జిల్లా కార్యాలయంలో సోమవారం ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ బీసీలకు రాష్ట్రస్థాయిలో అసెంబ్లీ, పార్లమెంట్ సీట్లలో పెద్ద ఎత్తున ప్రాధాన్యమిచ్చిందన్నారు. బీసీలను అన్ని రంగాల్లో రాజకీయంగా, సామాజికంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యం వైఎస్సార్‌సీపీలో ఉందన్నారు. సీఎం జగన్ బీసీలకు చాలా అనుకూలమైన వైఖరిని ప్రదర్శించడాన్ని ఆయన అభినందించారు. రాష్ట్రంలో బీసీల రాజకీయ ఉనికిని పెంచడానికి వైఎస్సార్‌సీపీ చేసే అన్ని ప్రయత్నాలకు తమ పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. ఇన్నేళ్లుగా బీసీలను పలు పార్టీలు ఓటు బ్యాంకుగా ఉపయోగించుకోవడం తప్ప చేసిందేమీ లేదన్నారు. వైఎస్సార్‌సీపీలో బీసీలకు అగ్రతాంబూలం ఇవ్వడం గొప్ప పరిణామమని అన్నారు. వైఎస్సార్‌సీపీ అనుసరిస్తున్న బీసీ అనుకూల వైఖరికి మద్దతుగా రాష్ట్రవ్యాప్తంగా బీసీ సమావేశాలు నిర్వహించడానికి సమాయత్తమవుతున్నామన్నారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా బీసీ సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో బీసీ నాయకులు ఉక్కుసూరి గోపాలకృష్ణ, లక్కోజు రాజగోపాలాచారి, కిలారపు శ్రీనివాసరావు(బుజ్జి), గొర్ల రామారావు, బొట్టా అజయ్, ఆకుల గంగాధరరావు, చిట్టిబోయిన సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు 239 కేంద్రాలు : జేసీ



ఏలూరు(మెట్రో): రబీ ధాన్యం సేకరణకు జిల్లాలో 239 రైతు భరోసా కేంద్రాలు గుర్తించామని జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి తెలిపారు. సోమవారం ఆమె ధాన్యం కొనుగోలు కేంద్రాల కార్యాచరణ వివరాలను విలేకరులకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోలు కార్యాచరణ ప్రక్రియ ఈనెల 6న ప్రారంభించామన్నారు. జిల్లాలో 80 వేల ఎకరాల్లో వరి సాగు చేయగా 3.12 లక్షల టన్నులు ధాన్యం దిగుబడి అంచనా వేశామన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా 2.40 లక్షల టన్నులు ధాన్యం కొనుగోలుకు నిశ్చయించామన్నారు. జిల్లాలోని 27 మండలాల్లో సుమారు 21 మండలాల్లో వరి సాగు ఎక్కువగా ఉందని, ముఖ్యంగా భీమడోలు, ఉంగుటూరు, దెందులూరు, నిడమర్రు మండలాల నుంచి ధాన్యం ఎక్కువ ఉత్పత్తి వస్తుందని అన్నారు. ధాన్యం కొనుగోలు 77 లక్షలు గోనె సంచులు అవసరం కాగా ఇప్పటికే 40 లక్షల సంచులు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఏ గ్రేడ్ ధాన్యం క్వింటాలకు రూ.2,203, సాధారణ రకం రూ.2,183 కనీస మద్దతు ధరగా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ధాన్యం సొమ్ములతో పాటు రవాణా, కూలీలు, గోనె సంచుల ఖర్చు ప్రభుత్వం భరిస్తుందన్నారు. రవాణా చేసే వాహనాలకు జీపీఎస్ ట్యాగింగ్ ఉంటుందన్నారు. సేకరించిన ధాన్యాన్ని ఆన్‌లైన్ ద్వారా జిల్లాలో 98 రైస్ మిల్లులకు అనుసంధానం చేశామని, వీటి నిర్వహణకు ప్రత్యేక అధికారులను నియమించామన్నారు. సమీపంలోని రైస్‌మిల్లులకు ధాన్యాన్ని తరలించుకోవచ్చన్నారు. సమావేశంలో సివిల్ సప్లయీస్ డీఎం మంజు భార్గవి పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌కు 500 మంది హాజరు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జాతీయ స్థాయి విద్యాసంస్థలు నిట్, ఐఐటీలో ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామ్ (జేఈఈ) మెయిన్స్ రెండో విడత పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. స్థానిక సిద్ధార్థ క్వెస్ట్ కేంద్రంలో ఉదయం 180 మందికి 168 మంది, సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 84 మందికి 79 మంది, మధ్యాహ్నం సిద్ధార్థ క్వెస్ట్‌లో 180 మందికి 171 మంది, సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 86 మందికి 82 మంది హాజరయ్యారు. పరీక్షలను కో–ఆర్డినేటర్ పి.సాయికుమారి శంకర్ పర్యవేక్షించారు.

గాత్ర విద్వాంసురాలికి పురస్కారం

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడేనికి చెందిన గాత్ర సంగీత విద్వాంసురాలు లంకా అనురాధకు ప్రతిష్టాత్మకమైన మెగా సిటీ నవ కళావేదిక (హైదరబాద్) క్రోధి నామ సంవత్సర ఉగాది పురస్కారాన్ని సోమవారం సాయంత్రం హైదరాబాద్‌లో అందజేశారు.

రాష్ట్రంలో ఎగిరేది వైఎస్సార్‌సీపీ జెండానే..

ఎమ్మెల్యే ఆళ్ల నాని, ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్



ఏలూరు 21వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే ఆళ్ల నాని, ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్

ఏలూరు టౌన్: రాష్ట్రంలో మరోసారి ఎగిరేది వైఎస్సార్‌సీపీ జెండానే అనీ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టి పేదవర్గాల ప్రజలకు మరింత సంక్షేమాన్ని అందిస్తారనీ, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తారని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. ఏలూరులో సోమవారం ఐదో రోజు ఎన్నికల ప్రచారాన్ని ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్‌తో కలిసి ఆయన చేపట్టారు. నగరంలోని 21, 20 డివిజన్లలో ఇంటింటా ఎన్నికల ప్రచారం చేశారు. 21వ డివిజన్ కార్పొరేటర్ అన్నపనేని భారతి, శ్రీభారతి విద్యాసంస్థల అధినేత అన్నపనేని రవికుమార్, 20వ డివిజన్ కార్పొరేటర్ గూడూరి ఆదిలక్ష్మి, పార్టీ నాయకులు గూడూరి ప్రసాద్ ఆధ్వర్యంలో వారికి అపూర్వ స్వాగతం పలికారు. ఏలూరులోని యాదవనగర్, శాంతినగర్, రామకృష్ణాపురంలో ఇంటింటా ప్రచారం చేశారు. రెండు ఓట్లూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు వేసి అఖండ విజయం చేకూర్చాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలంతా ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఘన విజయం అందించాలని కోరారు. రాష్ట్రంలో మరోసారి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభంజనం సృష్టిస్తూ సంచలన విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఏలూరు జిల్లాలోని ఏడు అసెంబ్లీ, ఎంపీ స్థానాన్ని కైవసం చేసుకుని వైఎస్సార్‌సీపీ సత్తా చాటుతుందన్నారు. ఐదేళ్ల కాలంలో సంక్షేమాన్ని అందించి, ప్రజల మనసుల్లో సీఎం జగన్ నిలిచిపోయారని, చంద్రబాబు కూటమి ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా వార్ వన్‌సైడ్ అవుతుందన్నారు. ఏలూరు నియోజకవర్గంలో ప్రజలకు సంక్షేమంతోపాటు అభివృద్ధి చేసి చూపించామనీ, మరోసారి మరింత అభివృద్ధి సాధించే దిశగా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో పనిచేస్తామని హామీ ఇచ్చారు. ఏలూరు నియోజకవర్గంలో ఏకంగా 32 వేల మంది పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశామని గుర్తు చేశారు. మూడు వైఎస్సార్ జగనన్న కాలనీల్లో పేదలకు ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా జరిగేందుకు చర్యలు తీసుకున్నామని ఆళ్ల నాని అన్నారు.

ఉగాది శుభాకాంక్షలు



ఆళ్ల నాని, ఎమ్మెల్యే

ఏలూరు టౌన్: శ్రీ క్రోధినామ సంవత్సరాది సందర్భంగా వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆళ్ల నాని ప్రజలకు, అధికారులకు, ఎమ్మెల్యేలు, ఎంపీ, పార్టీ శ్రేణులకు శుభాకాంక్షలు తెలిపారు. క్రోధి నామ సంవత్సరంలో జిల్లా ప్రజలకు అన్నీ శుభాలు జరగాలని ఆకాంక్షించారు. షడ్రుచుల సమ్మేళనంతో ప్రారంభమయ్యే ఉగాది కొత్త లక్ష్యాలను, కొత్త ఆలోచనలకు, ప్రతి ఒక్కరి ఉజ్వల భవిష్యత్‌కు, జిల్లా సమగ్రాభివృద్ధికి కొత్త సంవత్సరం దోహదపడాలని అన్నారు.

శుభాలు కలగాలని..

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లా ప్రజలకు కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఏడాదంతా ప్రజలకు అన్నీ శుభాలు కలగాలని, ప్రతిఒక్కరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ప్రజలంతా ఉగాది పండగను సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని అన్నారు.

అక్రమ నీటి వినియోగాన్ని అరికట్టాలి

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



ఏలూరు(మెట్రో): జిల్లాలో ప్రస్తుత వేసవిలో తాగు నీటి అవసరాలను దృష్టిలో పెట్టుకొని అక్రమ నీటి వినియోగాన్ని నిరోధించేందుకు జిల్లా, డివిజన్, మండల, గ్రామస్థాయి బృందాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి వివరించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా, ఉపాధి హామీ ద్వారా వేతన ఉత్పత్తి, వేసవిలో విద్యుత్ సరఫరా తదితర అంశాలపై సోమవారం కలెక్టర్లతో రాష్ట్ర సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు ఏలూరు నుంచి కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సత్యనారాయణ, జెడ్పీ సీఈఓ కేఎస్ఎస్ సుబ్బారావు, ఈపీడీసీఎల్ ఎస్ఈ సాల్మన్ రాజు, డ్వామా పీడీ ఎ.రాము, డీపీఓ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కృష్ణా, గోదావరి కాల్వలకు సంబంధించి విడుదలవుతున్న నీటి సరఫరాను ప్రత్యేక పర్యవేక్షణ ద్వారా అన్ని సమ్మర్ స్టోరేజ్, మంచినీటి చెరువులను నింపేందుకు పటిష్ట చర్యలు తీసుకున్నామన్నారు. ఈనెల 17లోపు వీటిని పూర్తిస్థాయిలో నింపేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. క్యామ్ బెల్ పంట కాలువ కింద 40 ట్యాంకులు నింపేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. అలాగే మంగళవారం మధ్యాహ్నం ప్రాంతంలో పోలరాజ్ చానల్ ద్వారా వచ్చే నీటిని దీని కింద ఉన్న 68 ట్యాంకులను నింపేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. మంచినీటి కాల్వల నుంచి చేపల, రొయ్యల చెరువులకు అక్రమంగా నీటిని వినియోగించకుండా ప్రత్యేక పర్యవేక్షణ చేస్తామన్నారు. శివారు ప్రాంతాలకు కూడా తాగునీరు అందేలా చర్యలు తీసుకున్నామన్నారు.

ముగిసిన మూల్యాంకనం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): పదో తరగతి పబ్లిక్ పరీక్షల జవాబుపత్రాలు మూల్యాంకనం సోమవారంతో స్థానిక సెయింట్ గ్జేవియర్ పాఠశాలలో ప్రశాంతంగా ముగిసిందని డీఈఓ ఎస్.అబ్రహం ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 1,018 మంది ఉపాధ్యాయులు 1,97,756 జవాబు పత్రాలను మూల్యాంకనం చేశారన్నారు. టెన్త్ మూల్యాంకనం నిర్దేశిత సమయానికి పూర్తిచేయడం అభినందనీయమని వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి గెడ్డం సుధీర్ ప్రశంసించారు. ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేశారని, సానుకూల దృక్పథంతో ఉపాధ్యాయ సంఘాల నాయకులు సైతం సహరించారని హర్షం వ్యక్తం చేశారు. విధులకు హాజరైన ఉపాధ్యాయులకు అసౌకర్యం కలగకుండా డీఈఓ అబ్రహం తీసుకున్న చొరవ అభినందనీయమన్నారు. రాష్ట్ర పరిశీలకులు ఆర్.నరసింహరావు, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ ఎల్.శ్రీకాంత్‌లు ప్రత్యక్షంగా పర్యవేక్షించారన్నారు.

ముస్లింల అభివృద్ధికి కట్టుబడిన జగన్



ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే అభ్యర్థి విజయరాజు

జంగారెడ్డిగూడెం: ముస్లింల అభివృద్ధికి సీఎం జగన్ మోహన్‌రెడ్డి కట్టుబడి ఉన్నారని చింతలపూడి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కంభం విజయ రాజు, పోలవరం నియోజకవర్గ పరిశీలకుడు జెట్టి గురునాథరావు అన్నారు. జంగారెడ్డిగూడెం పాత బస్టాండ్ వద్ద పటాన్ ముజీమ్ ఖాన్ ఆధ్వర్యంలో అమీర్ పర్వేజ్ నిర్వహించిన ఇఫ్తార్ విందులో సోమవారం వారు పాల్గొన్నారు. ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముస్లింల అభ్యున్నతి కోసం సీఎం జగన్ పలు పథకాలు అమలు చేశారన్నారు. మసీదుల అభివృద్ధి కోసం నిధులు కేటాయింపు, మౌజన్‌లకు గౌరవ వేతనాలు ఇలా ఎన్నో కార్యక్రమాలు చేపట్టారన్నారు. రాష్ట్రంలో కుల, మత, వర్గ బేధాలు లేకుండా అర్హతే ప్రామాణికంగా పథకాలు అందించారన్నారు. అటువంటి పథకాలు నిరంతరాయంగా కొనసాగాలంటే మరోసారి జగన్ ముఖ్యమంత్రి కావాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, తూర్పు గోదావరి జిల్లా వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ మహమ్మద్ ఆరిఫ్, వైఎస్సార్‌సీపీ నాయకులు, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, మండవల్లి సొంబాబు, బీవీఆర్ చౌదరి, మేడవరపు సాగర్, మున్సిపల్ వైస్ చైర్మన్ ముప్పిడి అంజి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ అక్బర్, బిలాల్ మసీద్ ప్రెసిడెంట్ షేక్ జిలానీ, పార్టీ పట్టణ అధ్యక్షుడు చిటికెల అచ్యుతరామయ్య, పట్టణ యూత్ అధ్యక్షుడు కాసర బన్నీ, సొసైటీ చైర్మన్ కంచర్ల రవి, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికలకు పటిష్ట భద్రత

ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్



సమీక్షిస్తున్న ఐజీ అశోక్‌కుమార్, చిత్రంలో ఎస్పీ

ఏలూరు టౌన్: సార్వత్రిక ఎన్నికలలో ప్రశాంతంగా, స్వేచ్ఛగా ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకునేలా పటిష్ట చర్యలు చేపట్టాలనీ, పోలీస్ అధికారులు, సిబ్బంది నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ అన్నారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి అధ్యక్షతన జిల్లాలోని పోలీస్ అధికారులు, సాయుధ దళాల అధికారులతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా ఎస్పీ మేరీ ప్రశాంతి జిల్లాలో చేపట్టిన చర్యలు, భద్రత, పోలింగ్ కేంద్రాలు తదితర అంశాలపై వివరించారు. ఈ సందర్భంగా ఐజీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో సమస్యాత్మక గ్రామాలను గుర్తించి, పోలీస్ అధికారులు వాటిని సందర్శించి పరిస్థితులను నిత్యం పర్యవేక్షిస్తూ ఉండాలని చెప్పారు. గ్రామాల్లో నేరాలకు పాల్పడిన వ్యక్తులు, రౌడీషీటర్లు కదలికలపై ప్రత్యేక దృష్టి సారించి నిఘా మరింత పెంచాలన్నారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం ఏర్పడకుండా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులను ముందుగానే బైండోవర్ చేయాలని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న అరెస్టు వారెంట్లు వెంటనే అమలు పరిచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అంత రాష్ట్ర, అంతర్ జిల్లా చెక్‌పోస్టుల వద్ద ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తూ నగదు, మద్యం రవాణాను అడ్డుకోవాలని సూచించారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేలా బహుమతులు, వస్తువులు తరలింపును కట్టడి చేసేందుకు తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. ప్రతి రోజూ ఆయా స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్‌లు, ఫుట్ పెట్రోలింగ్, వాహన తనిఖీలు చేపట్టాలన్నారు. సమీక్షలో జిల్లా అదనపు ఎస్పీ జి.స్వరూపరాణి, ఏఆర్ అదనపు ఎస్పీ ఎన్ఎస్ఎస్ శేఖర్, జిల్లాలోని డీఎస్పీలు, ఏఆర్ ఆర్ఐ పవన్‌కుమార్ ఉన్నారు.

టీడీపీ అభ్యర్థికి చేదు అనుభవం

పార్థసారథిపై ఆగ్రహించిన మహిళలు



గోగులంపాడులో పార్థసారథిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానికులు

ముసునూరు: సొంత సామాజిక వర్గం వారిని మీరు యాదవులు కాదా అని ప్రశ్నించడంతో తీవ్ర వాగ్వాదం చెలరేగి నూజివీడు టీడీపీ అభ్యర్థి బతుకు జీవుడా అంటూ వెనుదిరిగిన ఉదంతం సోమవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని చింతలవల్లి శివారు గోగులంపాడుకు చెందిన టీడీపీ అనుయాయుడు గంగుల చింపిరియ్య (75) సోమవారం వేకువజామున మృతి చెందాడు. మధ్యాహ్నానికి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలుసు పార్థసారథి పరామర్శించేందుకు మృతుని ఇంటికి వచ్చారు. ఈ సందర్భంలో పెద్దలంతా బయట పందిరి కింద ఉండగా, పార్థసారథి కొంచెం అవతలగా ఉన్న మహిళలతో తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. మాటల మధ్యలో వారితో మీరు గొల్లలు (యాదవులు) కాదా? అని ప్రశ్నించగా, మహిళలు వెంటనే స్పందించి, మరి నీవు యాదవుడవు కాదా? నీవేమైనా దళితుడవా? లేక చౌదరివా? అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. దీంతో కాస్త వాగ్వాదం చోటుచేసుకోవడంతో స్థానిక పెద్దలు అక్కడకు చేరుకుని సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. అనంతరం పార్థసారథి నేతలతో కలిసి అక్కడి నుంచి వెనుదిరిగారు.

ఎన్నికల కోడ్ కచ్చితంగా అమలుచేయాలి

భీమవరం: ఎన్నికల విధుల నిర్వహణలో అధికారులంతా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా పాటించాలని, లేదంటే కఠిన చర్యలు తప్పవని మంగళగిరి హెడ్‌క్వార్టర్స్ సెబ్ స్పెషల్ యూనిట్ ఎస్పీ ఎన్‌వీఎస్ మూర్తి అన్నారు. సోమవారం భీమవరం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన సమావేశం నిర్వహించారు.

మనసు గాయపడి.. కొలువు వీడి


కొవ్వలిలో రాజీనామా చేసిన వలంటీర్లు


రాజీనామా అనంతరం ఎమ్మెల్యే ప్రతాప్‌ను కలిసిన జంగంగూడెం వలంటీర్లు

- కూటమి నేతల తీరుతో వలంటీర్లలో మనోవేదన
- విష ప్రచారం, వేధింపులతో తీవ్ర మనస్తాపం
- గ్రామాల్లో మూకుమ్మడిగా రాజీనామాలు

నూజివీడు: టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తల తీరుతో వలంటీర్ల మనసు గాయపడింది. గత నాలుగున్నరేళ్లుగా పార్టీలకతీతంగా ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా అర్హులైన లబ్ధిదారులకు అందేలా ఎంతో విలువైన సేవలందించిన వలంటీర్లపై కూటమి నేతలు విషప్రచారానికి తెరలేపారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నాటి నుంచి గ్రామాల్లో టీడీపీ, జనసేన అధినేతలు, నాయకులు, కార్యకర్తలు వ్యవహరిస్తున్న తీరు మరింత తీవ్రం కావడంతో వలంటీర్లు మనోవేదనకు గురవుతున్నారు. నిస్వార్థంగా సేవలందించినా గుర్తించకపోగా, తీవ్ర విమర్శలు గుప్పించడం, అనుమానాలు, వేధింపులకు గురిచేయడంతో లోలోన మదనపడుతున్నారు. కూటమి నేతల తీరుతో మనస్తాపంతో జిల్లాలో పలువురు వలంటీర్లు తమ ఉద్యోగాలకు మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తున్నారు. నూజివీడు మండలం జంగంగూడెంలో పనిచేస్తున్న 16 మంది వలంటీర్లు సోమవారం ఇలా రాజీనామాలు చేశారు. ఎంపీడీఓ కె.కిరణ్‌కుమార్‌ను కలిసి తమ రాజీనామా లేఖలను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావును కలిసి తాము పడుతున్న ఇబ్బందులను మొరపెట్టుకున్నారు.

ఇంత దారుణమా

ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన దగ్గర నుంచి గ్రామాల్లో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తల వేధింపులు ఎక్కువయ్యాయని వలంటీర్లు వాపోతున్నారు. ఇరుగు పొరుగు వాళ్ల ఇళ్లకు వెళ్లినా వారిపై నిఘా పెడుతూ ఫొటోలు తీస్తున్నారని, అంతేగాకుండా కూరగాయల కోసమో, నిత్యావసరాల కోసమో షాపుల వద్దకు వెళ్లినప్పుడు ఎవరైనా నాయకుడో, ప్రజాప్రతినిధో కనిపిస్తే వారిని పలకరించడం కూడా ఎన్నికల ప్రచారం చేస్తున్నారంటూ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని చెబుతున్నారు. టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తల తీరు చూస్తుంటే తాము ఎన్నికల కోడ్ ముగిసే వరకు ఇళ్లలో నుంచి కూడా బయటకు రాకూడదన్నట్టుగా ఉందని వలంటీర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వారి తీరుకు మనస్తాపంతోనే వలంటీర్ల విధులకు రాజీనామా చేసినట్లు వలంటీర్లందరూ ముక్తకంఠంతో చెబుతున్నారు.


ఈదులగూడెంలో రాజీనామా చేసిన వలంటీర్లు

కుటిల రాజకీయాలకు నిరసనగా..

ఆగిరిపల్లి: మండలంలోని ఈదులగూడెంలో 16 మంది వలంటీర్లు సోమవారం ముకుమ్మడిగా రాజీనామాలు చేశారు. తమ రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శి నవీన్‌కు అందజేశారు. చంద్రబాబు స్వార్థ రాజకీయాలతో పింఛన్లు అందించకుండా అడ్డుకున్న కుటిల రాజకీయాలకు నిరసిస్తూ తాము రాజీనామాలు చేసినట్లు తెలిపారు. ఎన్నికల్లో తమ సత్తా ఏమిటో చూపిస్తామని స్పష్టం చేశారు.

గుణపాఠం చెబుతాం

దెందులూరు: వలంటీర్లను కించపరిచేలా మాట్లాడుతున్న కూటమి నేతలకు గుణపాఠం చెబుతామని ఉద్యోగాలకు రాజీనామా చేసిన వలంటీర్లు హెచ్చరించారు. మండలంలోని పోతునూరులో 15, కొవ్వలిలో 20 మంది వలంటీర్లు సోమవారం తమ ఉద్యోగాలకు రాజీనామాలు చేశారు. రాజీనామా పత్రాలను ఆయా అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వలంటీర్ల సేవలను దేశవ్యాప్తంగా ప్రశంసిస్తుంటే ఇక్కడి కూటమి నేతలు దుర్మార్గంగా వ్యవహరిస్తూ వేధింపులకు గురిచేస్తుండటం బాధ కలిగించిందని, దీంతో తాము ఉద్యోగాలకు రాజీనామాలు చేశామన్నారు.

తనిఖీల్లో 5.35 లక్షల నగదు పట్టివేత

జంగారెడ్డిగూడెం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జంగారెడ్డిగూడెం హైవేపై చెక్‌పోస్టు వద్ద సోమవారం నిర్వహించిన వాహన తనిఖీల్లో రూ.1.35 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఎస్‌టీ బృందం ఇన్‌చార్జి పి.బ్యూలా చెప్పారు. ఎ.పోలవరం నుంచి జంగారెడ్డిగూడెంకు ఒక వ్యక్తి ఈ నగదును బ్యాగులో పెట్టుకుని బైక్‌పై వెళుతుండగా, చెక్‌పోస్టు వద్ద తనిఖీల్లో గుర్తించామన్నారు. ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో నగదును సీజ్ చేసి ఏఆర్‌వో కె.స్లీవజోజికి అప్పగించినట్లు తెలిపారు.


కృష్ణారావుపాలెంలో..

చాట్రాయి: మండలంలోని కృష్ణారావుపాలెం గ్రామంలో చెక్‌పోస్టు వద్ద సోమవారం తనిఖీల్లో రూ.4 లక్షల నగదును పట్టుకున్నట్లు అసిస్టెంట్ ఎన్నికల అధికారి మహ్మద్ మసూద్ అలీ చెప్పారు. ఖమ్మం జిల్లా గంగవరం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఎటువంటి ఆధారాలు లేకుండా ఈ నగదుని తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు.

నేటి నుంచి వసంత నవరాత్రి ఉత్సవాలు

లక్ష గాజుల అలంకరణలో దర్శనమివ్వనున్న కుంకుళ్లమ్మ


ఆలయాన్ని అలంకరిస్తున్న సిబ్బంది


కుంకుళ్లమ్మ అమ్మవారు

ద్వారకాతిరుమల : శ్రీవారి ఆలయానికి ఉపాలయమై, క్షేత్ర దేవతగా విరాజిల్లుతోన్న శ్రీ కుంకుళ్లమ్మ అమ్మవారి ఆలయంలో వసంత నవరాత్రి ఉత్సవాలు మంగళవారం ప్రారంభం కానున్నాయి. ఈనెల 17 వరకు జరుగనున్న ఈ ఉత్సవాలను పురస్కరించుకుని నిత్యం ఆలయంలో విశేష పూజా కార్యక్రమాలు జరుగనున్నాయి. అందులో భాగంగా తొలిరోజు ఉగాది నాడు అమ్మవారు లక్ష గాజుల అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారని ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు. అమ్మవారికి కుంకుమ పూజలు, చండీ హోమం వంటి కార్యక్రమాలు జరుగుతాయని, అందులో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

లోగ్రేడ్ పొగాకును వెంటనే అమ్ముకోవాలి

జంగారెడ్డిగూడెం/కొయ్యలగూడెం: లోగ్రేడ్ పొగాకుకు మంచి ధర వస్తున్నందున వర్జీనియా రైతులు సద్వినియోగం చేసుకోవాలని పొగాకు బోర్డు చైర్మన్ సీహెచ్ యశ్వంత్‌కుమార్, వైస్ చైర్మన్ గుత్త వాసుబాబు అన్నారు. జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెంలలో వేలం కేంద్రాలను సోమవారం వారు సందర్శించి పొగాకు వేలం ప్రక్రియను పర్యవేక్షించారు. అనంతరం వారు మాట్లాడుతూ నిర్దిష్ట సమయంలోగా వేలం కేంద్రాలకు బేళ్లు తీసుకువచ్చి అమ్ముకోవాలని రైతులకు సూచించారు. రైతులు మాట్లాడుతూ తుపాను కారణంగా తోటలు దెబ్బతిని ఎక్కువగా లోగ్రేడ్ వచ్చిందని, కేజీకి రూ.300 కనీస ధర రాకపోతే భారీగా నష్టపోతామని వాపోయారు. దీనిపై వారు మాట్లాడుతూ రైతులకు అనుకూలంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. జంగారెడ్డిగూడెంలో వర్జీనియా పొగాకు రైతుల కోసం కమ్యూనిటీ హాల్‌ను మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఆర్ఎంలు ఆదిశేషయ్య, గ్రేసీ మార్గరేట్, పొగాకు బోర్డ్ సూపరింటెండెంట్‌లు బి.శ్రీహరి, సురేంద్ర పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌నంటూ టోకరా

కుక్కునూరు: నగదు ఇస్తాను ఫోన్‌పే చేయాలంటూ కానిస్టేబుల్‌నని చెప్పుకున్న ఓ గుర్తు తెలియని వ్యక్తి పెట్రోల్ బంక్ సిబ్బంది నుంచి రూ.34 వేలు కాజేశాడు. వివరాల్లోకి వెళితే ఆదివారం రాత్రి స్థానిక పెట్రోల్ బంక్ యజమానికి ఫోన్ చేసిన ఓ వ్యక్తి తాను స్థానిక స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నట్లు పరిచయం చేసుకున్నాడు. తన సోదరి కుమారుడికి ఆరోగ్యం బాగోలేదని, వెంటనే తన సోదరికి రూ.34 వేలు నగదు పంపించాలని, నగదు ఇస్తాను, ఫోన్‌పే చేయాలని కోరాడు. దీంతో నిజమేనని నమ్మిన బంక్ యజమాని బంక్ సిబ్బందికి ఫోన్ చేసి నగదు తీసుకుని ఫోన్‌పే చేయాలని సూచించాడు. బంక్ యజమాని నుంచి బంక్‌లో పనిచేస్తున్న యువకుడి ఫోన్ నంబర్ తీసుకున్న సదరు గుర్తు తెలియని వ్యక్తి, తాను డ్యూటీలో ఉన్నానని, డ్యూటీ దిగి వచ్చి క్యాష్ ఇస్తానంటూ నమ్మబలికి రూ.34 వేలు ఫోన్ పే చేయించుకున్నాడు. అయితే ఎంతసేపైనా రాకపోవడంతో ఫోన్ నంబర్‌కు ఫోన్ చేయగా, స్విచ్చాఫ్ అని రావడంతో మోసపోయానని గ్రహించి పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశాడు.

విద్యుదాఘాతానికి కూలీ మృతి

జంగారెడ్డిగూడెం రూరల్: నిమ్మలగూడెంలో పామాయిల్ గెలలు కోస్తుండగా విద్యుత్ షాక్‌కి గురై ఒక కూలీ మృతి చెందాడు. లక్కవరం గ్రామానికి చెందిన ఉండ్రాజవరపు గాంధీ (45) నిమ్మలగూడెంలో కౌలుకు సాగు చేస్తున్న పట్టపు మురళీ పామాయిల్ తోటలోకి గెలలు కోసేందుకు సోమవారం వెళ్లాడు. గెల కోస్తుండగా, హైలెవెల్ విద్యుత్ వైర్లకు కత్తి తగలడంతో గాంధీ విద్యుత్ షాక్‌కి గురయ్యాడు. దీంతో అతనిని లక్కవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లాడు. వైద్యులు పరీక్షించి గాంధీ మృతి చెందినట్లు నిర్ధారించారు. లక్కవరం ఎస్సై సుధీర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో అక్రమంగా రవాణా చేస్తున్న ఐదు టన్నుల పీడీఎస్ బియ్యాన్ని అధికారులు పట్టివేశారు. సీఎస్‌డీటీ వైవీ లక్ష్మీకుమారి, ఎస్సై పి.జ్యోతిబాస్ సోమవారం చేసిన వాహన తనిఖీల్లో జంగారెడ్డిగూడెం నుంచి దూబచర్లకు లారీలో 5 టన్నుల బియ్యం రవాణా అవుతున్నట్లు గుర్తించి, వాటిని పరిశీలించగా, పీడీఎస్ బియ్యంగా నిర్ధారించారు. బియ్యం, వాహనం స్వాధీనం చేసుకుని, వ్యాన్ యజమాని సాన తేజ కుమార్, వ్యాన్ డ్రైవర్ మేడిది వీరబాబులపై కేసులు నమోదు చేశారు.

50 లీటర్ల సారా స్వాధీనం

చాట్రాయి: అక్రమంగా తరలిస్తున్న సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ స్వామి సోమవారం చెప్పారు. పర్వతాపురం ఫారెస్టులో సారా తయారు చేస్తున్నట్లు సమాచారం రావడంతో దాడి చేయగా, ఓ వ్యక్తిని అరెస్టు చేసి 50 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, 2,500 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు.

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.